بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ نَحْمَدُهٗ وَنُصَلِّی عَلٰی رَسُوْلِهِ الْكَرِيْمِ وَعَلٰی عَبْدِهِ الْمَسِيْحِ الْمَوْعُوْدِ

# Summary of Friday Sermon Huzur-e-Anwar 23.01.2015 (Telugu)

**ఖుత్బా కూడ నమాజులోని భాగమని గుర్తుంచుకోవలెను. అందుకే ఖుత్బాలో మాట్లాడుట నిషేధము. అనివార్యముగా మాట్లాడవలసినను, ఒకరిని నివారించవలసినను ఖుత్బా ఇచ్చుచున్న ఇమామ్ మాట్లాడవచ్చును. నమాజ్‌లో ఇమామ్ కూడ మాట్లాడలేడు. నమాజ్‌లో మాట్లాడుట నిషేధించబడినట్లే ఖుత్బాలో కూడ మాట్లాడుట నిషేధమని పిల్లలకు బాల్యము నుండే ఇంట్లో శిక్షణ ఇవ్వవలెను.**

*హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ 23.01.2015 తేదీన మస్జిద్ బైతుల్ ఫుతూహ్ - లండన్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము*

తషహ్హుద్, తఅవ్వుజ్, తస్మియ, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ప్రసంగించిరి.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం గురించి హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్‌హు ప్రస్తావించిన సంఘటనలను నేనిప్పుడు ప్రవేశపెట్టెదను. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం గౌరవము, మర్యాద గురించి వారి ప్రామాణికము, ప్రతిస్పందన ఎట్లుండెనో తెలుపుచు హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ఒక చోట ఇట్లనిరి. ఒక సారి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం లాహోర్ లేదా బటాలా రేల్వే స్టేషన్‌లో యుండిరి. పండిత్ లేఖ్రామ్ కూడ అక్కడికి వచ్చి వారికి సలాం చేసెను. పండిత్ లేఖ్రామ్ ఆరియా సమాజ్‌లో గొప్ప స్థాయి కలిగిన వ్యక్తి అయినందున హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వెంట యున్న వ్యక్తులు లేఖ్రామ్ వచ్చి వారికి సలాం చేసినాడని సంతోషపడిరి. కాని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అతని వైపు ఏమాత్రం శ్రద్ధ వహించలేదు. పండిత్ లేఖ్రామ్ సలాం చేసినది వారు చూడలేదని భావించి పండిత్ లేఖ్రామ్ సలాం చేయుచున్నాడని వారికి చెప్పిరి. వారప్పుడు ఎంతో ఉద్రేకముతో ఇట్లనిరి. నా యజమానిని దూషించుచు నాకు మాత్రం సలాం చేయుచున్నాడు. అతనికి సిగ్గు లేదా!

ఈ సంఘటననే తెలుపుచు మరోచోట వారిట్లనిరి. ఆరియాలో పండిత్ లేఖ్రామ్‌కు యున్న గౌరవము వలన వారితో సమావేశమగుట పెద్ద పెద్ద వ్యక్తులు తమ గౌరవముగా భావించేవారు. కాని హజ్రత్ మిర్జా గారి అభిమానము చూడుము. పండిత్ గారు స్వయముగా సమావేశమగుటకు వచ్చినను నా యజమానిని దూషించుటను వదిలినచో నేను సమావేశమగుదునని అనిరి. ఇక్కడ మనకు మరో గుణ పాఠము కూడ తెలియును. కొందరు పెద్దలని, వారికి సలాం చేసినచో మన గౌరవము నిలుచునని సలాం చేయుట సరిపోదు. పేదల గౌరవమును కూడ గుర్తుంచుకోవలెను. అభిమానము చూపించదగ్గ విషయము. మన రసూల్ సల్లల్లాహు అలైహి వసల్లం గురించి అసమంజస పదములు ఏ పెద్ద వ్యక్తి మాట్లాడినా అతనికి ప్రాముఖ్యత ఇవ్వవలసిన అవసరము లేదు.

మరో సంఘటనను వారు ప్రస్తావించుచు ఇట్లనిరి. తమ సంతానముతో హజ్రత్ మిర్జా గారి వ్యవహారము ఎంతో గొప్పగా యున్నందున వారు తమ సంతానముతో కోపమగుదురని అసలు ఊహించే అవకాశమే లేకుండెను. హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ ఇట్లనిరి. వారు మా అందరిని ఎంతో ప్రేమగా చూసుకునేవారు. అందరికంటే ఎక్కువ మా చిన్న సోదరుడు ముబారక్ అహ్మద్‌తో వారికి ప్రత్యేక ఆప్యాయత యుండెను. ఇంత కంటే ఎక్కువ వారు మరెవరిని ప్రేమించలేరని మేము భావించేవారము. కాని ఈ ప్రేమ ఆఁహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రేమను మించిపోలేదు. బాల్యములో ఈ గారాల పట్టిక తెలియక ఆఁహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం స్థాయికి విరుద్ధముగా ఒక మాట పలుకగా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గట్టిగా అతన్ని దండించిరి.

మరో సంఘటన తెలుపుచు హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్‌హు ఇట్లనిరి. ఆర్యుల ఒక సమావేశము లాహెూర్‌లో జరిగెను. దానిలో పాల్గొను ఆహ్వానము హజ్రత్ మిర్జా అలైహిస్సలాం గారికి కూడ పంపబడెను. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం గురించి ఎటువంటి అసమంజస పదములు పలుకమని సమావేశ నిర్వహకులు అంగీకరించిరి. కాని సమావేశములో అతిగా దూషించిరి. కొందరు మన జమాఅత్ సభ్యులు కూడ అక్కడికి వెళ్లిరి. వారిలో మౌల్వీ నూరుద్దీన్ గారు యుండిరి. హజ్రత్ మిర్జా గారు వారిని ప్రత్యేకంగా గౌరవించేవారు. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లంను సమావేశములో దూషించిన విషయము విన్నప్పుడు వారు మౌల్వీ గారితో ఇట్లనిరి. అక్కడ కూర్చొని యుండుటను మీ అభిమానము ఎట్లు భరించినది. ఎందుకు అక్కడి నుండి లేచి రాలేదు. అప్పుడు వారు ఎంతో ఉద్రేకముతో యున్నందున మౌల్వీ గారితో పూర్తిగా అసంతృప్తి చెందుదురని అనిపించెను. హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ అవ్వల్‌తో నేను కూడ వెళ్లియుంటిని. నీవెందుకు అక్కడ కూర్చొని యున్నావని నన్ను గట్టిగా మందలించిరి.

నవూజుబిల్లాహ్! ఆఁహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం కంటే వారు తనను గొప్పగా భావింతురని ఆరోపించేవారు ఇంతటి భావముల వ్యక్తమునకు పోటీగా నిలువగలరా! ఈ ఆరోపణలు చేయించేవారు ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంతో వారికి యున్న ప్రేమను పరిగణింతురు గాక!

అబ్దుల్లాహ్ ఆథమ్‌తో జరిగిన చర్చా గురించి వారిట్లు వ్రాసిరి. మసీహ్ మౌవూద్‌గా తనను తాను ప్రకటించుకొన్న తర్వాత ఈ చర్చ జరిగినది. మౌల్వీలు వారిని అవిశ్వాసులని, హతమార్చదగిన వారని తీర్మానించిరి. ఇటువంటి తరుణంలో ఒక అహ్మదియేతరుడు క్రైస్తవునితో పోటీ పడును. క్రైస్తవుడు జంధ్యాలె నివాసులైన అహ్మదియేతరులకు సవాలు విసిరెను. మా వైపున చర్చించగలరని వారు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంకు ఆహ్వానము పంపిరి. స్పందనగా వారు వెంటనే పోటీకి సంకల్పించిరి. అహ్మదియేతర మౌల్వీలు హత్యా తీర్మానాలు ఇచ్చినందున అహ్మదియేతరుల వలే క్రైస్తవులు మా శత్రువులు కాదని వారనలేదు. కాని అవసరము వచ్చినప్పుడు ఆఁహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం గౌరవము నిలుపుటకు, ఇస్లాం గౌరవమును స్థాపించుటకు, అల్లాహ్ ఏకత్వమును ఏర్పాటు చేయుటకు ఖాదియాన్ నుండి బయలు దేరి అహ్మదియేతరుల వైపున చర్చావేదికకు వెళ్లిరి. ఇది వారి విశ్వాసాభిమానము. ఇందుకు దేనిని ఖాతరు చేయలేదు.

ఇదొక సుదీర్ఘమైన చర్చ. 15 రోజుల వరకు కొనసాగినది. చివరలో వారు దుఆ చేసి ఒక ప్రమాణము ఏర్పరచి ఒక భవిష్యవాణి చేసిరి. ఈ భవిష్యవాణి గురించి వారిట్లనిరి. నేటి రాత్రి నాకు తెలుపబడిన విషయమేమనగా మేము బలహీన దాసులము, మేమేమి చేయలేము. కనుక నీవే మా మధ్య తీర్మానము చేయుమని నేను దైవాస్థానములో దుఆ చేసినప్పుడు అల్లాహ్ నాకిట్లు శుభవార్త నిచ్చెను. ఈ చర్చలో ఇరువురిలో ఉద్దేశపూర్వకముగా అసత్యమును అవలంభించుచున్న, అల్లాహ్‌ను వీడుచున్న వ్యక్తి ఈ చర్చా రోజుల అనుసారము అనగా ఒక రోజు ఒక మాసము ప్రకారము మొత్తం 15 మాసములలో పశ్చత్తాప పడనిచో శిక్షకు గురగును. సత్యముపై నున్న, నిజమైన దేవున్ని నమ్ముచున్న వ్యక్తి గౌరవము దీనితో ప్రత్యక్షమగును. ఇది చాలా సుదీర్ఘమైన విషయము. దీని గురించి హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) తెలిపిన రెండు సంఘటనలను తెలిపెదను.

ఒక సారి బహావల్‌పూర్ నవాబ్ గారి ఆస్థానములో మిర్జా గారి భవిష్యవాణి పూర్తి కాలేదు, ఆథమ్ ఇప్పటికి బ్రతికే యున్నాడని అపహాస్యము చేయడము మొదలు పెట్టిరి. నవాబ్ గారి గురువులైన ఖ్వాజా గులాం ఫరీద్ చాచ్డాం వాలె కూడ అప్పుడు నవాబ్ గారి ఆస్థానములో యుండిరి. సంభాషణ మధ్యలో అవును మిర్జా గారి భవిష్యవాణి పూర్తి కాలేదని నవాబ్ గారి నోట కూడ మాట వెలువడెను. అప్పుడు ఖ్వాజా గులాం ఫరీద్ గారు ఎంతో ఉద్రేకముతో ఆథమ్ బ్రతికియున్నాడని ఎవడనును. నాకు అతని శవము కనిపించుచున్నదని అనిరి. ఇది విని నవాబ్ గారు మౌనము వహించిరి. ఈ సంఘటన తెలిపి హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ ఇట్లనిరి. కొందరు బాహ్యముగా సజీవముగా కనిపించినా వాస్తవానికి మృతులై యుందురు. కొందరు మృతులుగా కనిపించినా వాస్తవానికి బ్రతికే యుందురు. అల్లాహ్ మార్గములో ప్రాణాలర్పించినవారు వాస్తవముగా బ్రతికే యుందురు. బ్రతికియున్నవారిలో వేలాది మంది ఆధ్యాత్మిక దృష్టి యున్నవారికి శవముగానే కనిపింతురు. ఆధ్యాత్మిక మృతులను, సజీవులను గుర్తించుట ప్రతి ఒక్కరి పని కాదు. నిజమైన విశ్వాసుడు దీనిని గుర్తించుటకు కృషి చేయవలెను.

అబ్దుల్లాహ్ ఆథమ్‌కు ఆధ్యాత్మిక మరణమే కాక శారీరక మరణము కూడ వచ్చెనని నేను తెలుపదలచితిని. కొంచెం వ్యవధి లభించెను. ఆ కారణములను కూడ స్వయముగా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తెలిపియుండిరి.

ఇదే ఆథమ్ భవిష్యవాణి గురించి ఒక చోట హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ఇట్లు తెలిపిరి. ఆథమ్ భవిష్యవాణి పూర్తి అయ్యే గడువు ముగిసే తుది రోజు అనగా 15 నెలలు పూర్తి అగుచున్న రోజు ఎంతో ఆందోళన ఏర్పడెను. దేవుడా! ఆథమ్ మరణించవలెనని ప్రజలు రోధించుచు దుఆ చేయుచుండిరి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం అసంతృప్తి వ్యక్తపరచి ఇట్లనిరి. అల్లాహ్ కంటే ఎక్కువ మానవునికెవరికైనా తన వాక్యము పట్ల ప్రకోపముండునా. ఇట్లు జరుగునని అల్లాహ్ చెప్పినప్పుడు ఇట్లు తప్పక జరుగునని మనము విశ్వసించవలెను. అల్లాహ్ వాక్యమును మనము తప్పుగా అర్థము చేసుకొన్నప్పుడు మన తప్పుడు ఆలోచన ప్రకారము పూర్తి చేయుటకు అల్లాహ్ బాధ్యుడు కాడు. ఒకరిని మనము సత్యవంతుడని విశ్వసించినప్పుడు అతని మాటను నమ్మవలెను. అల్లాహ్‌ను నమ్ముట విశ్వాసుని కార్యము. అల్లాహ్ వాక్యము

తప్పక పూర్తగును. భవిష్యవాణి కూడ పూర్తి వైభవముగా పూర్తి అయినది. దీని గురించి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అనేక చోట్ల ప్రస్తావించినారు. ఒకటి రెండింటిని నేను ప్రస్తావింతును.

వార్లినిరి. ఆథమ్ పశ్చత్తాపము గురించి సమస్యలను మన జమాఅత్ సదా గుర్తుంచుకోవలెను. భవిష్యవాణి వినగానే అతడు తన నాలుక బయటకు తీసి చెవులు పట్టుకొని తెల్లబారెను. ఒక పెద్ద సమూహము అతని ఈ పశ్చత్తాపమును చూచెను. అతనిని భయము ఆవహించుకొన్నందున అనేక నగరములకు పారిపోయెను. అతడు తన వ్యతిరేకతను వీడి ఇస్లాంకు విరుద్ధముగా ఎన్నడు ఎటువంటి లేఖనము ప్రచురించలేదు. బహుమానముతో కూడ కరపత్రము ద్వారా ప్రమాణము చేయుటకు పిలిచినప్పుడు అతడు ప్రమాణము చేయుటకు రాలేదు. కాని సాక్ష్యమును మరుగున పెట్టినందున ఆలస్యముగా మరణించినను తుదకు మరణించెను. ఈ విధముగా సమస్యలను గుర్తుంచుకొనుట ఒక బాధ్యత. ఇందుకు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం పుస్తకములను చదివినప్పుడు అవగాహన కలుగును.

మరో చోట వారిట్లనిరి. ఈ భవిష్యవాణి షరతులతో కూడినదైయుండెను. అతడు భయాందోళనకు గురై నగర, నగరములకు పారిపోయెను. అతని దృష్టిలో దేవుడైన మసీహ్‌పై అతనికి నమ్మకమున్నచో అతని భయమునకు అర్థమేమిటి. సత్యమును దాచినందున కొందరు అవగాహన రహితులు మార్గభ్రష్టులగుదురు. అందుకే అతడు సత్యమును దాచిపెట్టి ఒక ప్రపంచమును మోసము చేయదలచినప్పుడు అల్లాహ్ తన సత్యమైన వాగ్దానము ప్రకారము మా కరపత్రము తర్వాత ఏడు నెలల లోపే అతన్ని ఈ లోకము నుండి తీసుకెళ్ళెను. ఏ మృతితో అతడు భయపడుచు తిరుగుచూ, పారిపోవుచుండెనో అదే అతన్ని ఆవహించెను. ఆథమ్ విషయములో ప్రజలకు ఎందుకు ఇబ్బంది కలుగుచున్నదో నాకు అర్థం కాదు. ఇంతటి గట్టి నిదర్శనములున్నను నిరాకరణ ఎందుకు ? గట్టి నిదర్శనములతోనే న్యాయస్థానములు మరణ శిక్ష విధించును. ఆథమ్‌కు చెందిన ఈ సంఘటన పెద్ద చిహ్నమే.

ఈ చర్చ మధ్యలో క్రైస్తవ ప్రచారకులు కొందరు ముస్లిములను తమ వెంట కలుపుకొని అవమానించుటకు ఒక కుట్ర పన్నిరి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం చేరిన వెంటనే అంధులు, చెవిటి వారు, వికలాంగులను వారి ముందు ప్రవేశపెట్టి ఇట్లనిరి. మీరు నిజముగనే మసీహ్ పోలిక అయినచో వీరికి స్వస్థత కలిగించగలరు. కాని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. మీ గ్రంథము మీ విశ్వాసమును ఇట్లు తెలిపెను. ఇసుమంత విశ్వాసమున్న ప్రతి క్రైస్తవుడు యేసుక్రీస్తు చూపిన మహిమలను చూపగలడు. కనుక మీలో ఇసుమంత విశ్వాసమున్నచో మీరే వీరికి స్వస్థత కలిగించి చూపగలరు. ఈ సమాధానముతో పాద్రీలు ఆశ్చర్యచకితులైరి. పెద్ద పెద్ద పాద్రీలు ఆ వికలాంగులను ఈడ్చుకుంటూ అక్కడి నుండి తొలగించిరి. తన సామీప్యము గల వారికి అల్లాహ్ సదా గౌవరము ప్రసాదించును. శత్రువు విని ఆశ్చర్యచకితులయ్యే విధముగా సమాధానములు సూచించును.

హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ఇట్లనిరి. లుధ్యానాలో ఒకరు మీర్ అబ్బాస్ అలీ నామము గల ఒక వ్యక్తి యుండిరి. వారు హజ్రత్ గారితో ఎంతో విధేయత కలిగియుండిరి. వారి ప్రస్థుత స్థితి గురించి హజ్రత్ గారికి దైవవాణి కూడ అందెను. అదే మీర్ గారి గురించి హజ్రత్ గారికి ప్రశంసనీయ దైవవాణి కూడ

అందిన తర్వాత అతడెందుకు ధర్మభ్రష్టుడైనాడని కొందరు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను విమర్శించిరి. అప్పుడు వారిట్లనిరి. నిస్సందేహముగా దైవవాణిలో అతని గురించి ప్రశంస యుండెను. అతనిలో గొప్ప ఆధ్యాత్మిక శక్తులున్నవని దైవవాణి తెలుపుచుండెను. కాని అతడు ఆ శక్తులతో అక్రమ ప్రయోజనము పొందినాడు. అతనిలో గర్వము, అహంకారము ఏర్పడినది. తద్వారా అతనిపై దైవ ప్రకోపము పడి అతడు ధర్మభ్రష్టుడైనాడు. కనుక దుష్టత్వముల నుండి దూరముండుటకు ఫాతిహా అధ్యాయము చివరలో అల్లాహ్ నేర్పిన దుఆ విషయమును సదా గుర్తుంచుకోవలెను. బహూమానము పొందిన వారిలో అల్లాహ్ మనలను చేర్చుచు దాని చెడు ప్రభావములను ఎన్నటికి కలిగించకూడదు.

ధర్మబద్ధతకు బాహ్య విద్య కొలమాణము కాదను విషయము గురించి ఇట్లనిరి. ధర్మబద్ధతకు బాహ్య విద్య కొలమాణము చేసినచో నవూజుబిల్లాహ్ ప్రపంచ సందేశహరులందరిని అసత్యులని అనవలసి వచ్చును. ఎందుకనగా బాహ్య విద్యావంతులు సందేశహరులతో పోటీపడుదురు. తమను తాము బాహ్య విద్యలో నిపుణులని భావించిన వీరే హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను కూడ ఎదురించిరి.

సత్యము గురించి హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ఇట్లనిరి. హజ్రత్ గారు ఒక ప్యాకెట్‌లో ఒక లేఖ పెట్టిరి. అది తపాళా నియమములకు విరుద్ధమైయుండెను. కాని ఆ విషయము వారికి తెలియకుండెను. తపాళా వారు వారిపై వాజ్యము వేసిరి. దానిని వాదించుటకు ఒక ప్రత్యేక అధికారిని నియమించిరి. తప్పక శిక్ష పడవలెనని గట్టిగా ప్రయత్నించిరి. హజ్రత్ గారి న్యాయవాది వారితో ఇట్లనెను. లేఖను నేను విడిగా పంపినానని చెప్పగలరు. లేనిచో తప్పించుకునే అవకాశము లేదు. ఏది ఏమైనప్పటికి నేను అబద్ధము చెప్పలేనని వారనిరి. ఈ ప్యాకెట్‌లో మీరు లేఖ పెట్టినారా అని వారిని న్యాయస్థానములో ప్రశ్నించబడినప్పుడు అవును నేనే పెట్టినాను, కాని నాకు తపాళా శాఖ ఈ నియమము గురించి తెలియదని అనిరి. వీరు ఇంత సత్యముగా విషయమును చెప్పినందున నేను వీరు నిర్దోషులని ప్రకటించుచున్నానని న్యాయమూర్తి అనెను. ఈ సంఘటనను మనలో అనేకులు ఎన్నో సార్లు విన్నారు. కాని మనము విని కేవలము ఆనందము పొందుతాము. సత్యపు ప్రమాణపు అతి చిన్న ప్రమాణమిది. కాని తమ స్వార్థము కొరకు సత్యపు ప్రమాణము నుండి దిగజారే వారు ఆత్మ పరిశీలన చేసుకోవలసిన అవసరమున్నది. ఈ దేశములలో అసైలమ్ కొరకు, భీమా కంపెనీల నుండి లబ్ది పొందుటకు అక్రమ పద్ధతులను అవలంభింతురు. ఇటువంటి కార్యములకు పాల్పడే అహ్మదీయులు ఆలోసించవలెను. ఈ అక్రమ పద్ధతులలో ప్రాపంచిక ప్రయోజనములు పొందుట ఒక అహ్మదీయుని స్థాయికి తగదు.

ఒక సారి ఒక ఖుత్బాలో హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ఇట్లనిరి. జగడములు, పీడనముల నుండి దూరముండగలరని జమాఅత్ సభ్యులకు వారందులో సూచించిరి. అనంతరం ఖుత్బాలో ఒక వ్యక్తి గురించి ఇట్లనిరి. ఇదే కారణము వలన అతన్ని బహిష్కరించనైనదని కూడ తెలిపిరి. ద్వితీయ ఖుత్బా మొదలైన వెంటనే ఖుత్బా మధ్యలోనే ఒక వ్యక్తి నిలబడి బహిష్కరించబడిన ఆ వ్యక్తి ఎవరు ? అని ప్రశ్నించెను. అందుకు ఖుత్బాలో మాట్లాడకూడదని మరో వ్యక్తి అనెను. హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ హాస్యించి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి ఒక సంఘటన వినిపించిరి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం

తమ తనిఖీ విషయమును (ఒక సమావేశములో) వినుపించుచుండిరి. పండిత్ లేఖ్రామ్ హత్య గురించి గుర్దాస్‌పూర్ సూపరింటెండెంట్ పోలీస్ ఈ తనిఖీ చేసెను. సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఒక చిన్న ద్వారము నుండి వెళ్ళుచుండెను. దర్వాజ దూలమునకు అతని తల తగిలి గాయమయ్యెను. పాలు త్రాగమని మేము అతనితో అంటిమి. కాని అతడు నిరాకరించెను. ఇప్పుడు నేను తనిఖీకి వచ్చినాను. ఇది నా విధులకు విరుద్ధమగును. ఇప్పుడు మాట్లాడిన వ్యక్తియే హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను అప్పుడు ఇట్లు ప్రశ్నించెను. హుజూర్ తల నుండి రక్తము ప్రవహించినదా ? హజ్రత్ గారు నవ్వి, నేను అతని టోపీ తీసి చూడలేదని అనిరి.

ఈ విధముగా కొందరికి అనవసరముగా మాట్లాడే అలవాటుండును. ఏది ఏమైనప్పటికి ఖుత్బాలో మాట్లాడుట నిషేధము. ఖుత్బాలో మాట్లాడకూడదని మాటలతో బోధించిన రెండవ వ్యక్తి కూడ పొరపాటు చేసెను. సంజ్ఞ చేయబడును లేదా తర్వాత చెప్పబడును. ఇందుకు హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ మరో హాస్యమును వినిపించిరి. ఒక సారి నమాజ్ సామూహికముగా జరుగుచుండగా ఒక వ్యక్తి మస్జిద్‌లోకి వచ్చెను. అతడు గట్టిగా సలాం చేసినందున నమాజ్‌లో యున్న మరో వ్యక్తి అంతే గట్టిగా వఅలైకుముస్సలాం అనెను. అతని ప్రక్కనే నిలబడి యున్న మరో వ్యక్తి నమాజ్‌లో సమాధానమివ్వకూడదని నీకు తెలియదా అనెను. ఖుత్బా కూడ నమాజులోని భాగమని గుర్తుంచుకోవలెను. అందుకే ఖుత్బాలో మాట్లాడుట నిషేధము. అనివార్యముగా మాట్లాడవలసినను, ఒకరిని నివారించవలసినను ఖుత్బా ఇచ్చుచున్న ఇమామ్ మాట్లాడవచ్చును. నమాజ్‌లో ఇమామ్ కూడ మాట్లాడలేదు. నమాజ్‌లో మాట్లాడుట నిషేధించబడినట్లే ఖుత్బాలో కూడ మాట్లాడుట నిషేధమని పిల్లలకు బాల్యము నుండే ఇంట్లో శిక్షణ ఇవ్వవలెను.

Khulasa Khutba Juma Huzure Anwar 23 January 2015

*Translated By Hafiz Syed Rasool Niyaz For Telugu Desk*

From: Nazarath Nashr-O-Isha'ath, Qadian, Distt:Gurdaspur, Pin:143516, Punjab